క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి భూసేకరణ అంశాలపై పేర్ని నాని, జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్‌తో శనివారం చర్చించారు. రోడ్డు, రైలు మార్గాలకు సంబంధించి రెండో దశ భూ సేకరణ చేయాల్సిన ప్రాంతాలు, భూములు, రైతుల వివరాలు తెలుసుకుని ఎవరికి ఎంత విస్తీర్ణం భూమి ఉందో దానిని బట్టి భూ సేకరణ చేయాలని సూచించారు. అలాగే ఇప్పటివరకు చేసిన భూ సేకరణలో కోర్టు సమస్యలపై కూడా వీరు ఇరువురు చర్చించారు. సమావేశంలో బందరు ఆర్డీఓ ఐ. కిషోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు

మచిలీపట్నంటౌన్: ఆజాద్ రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జయంతి మహోత్సవాలు ఆదివారం నుంచి మే 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతాయని ఆలయ కార్యవర్గ సభ్యులు శనివారం తెలిపారు. శనివారం ఉత్సవాల కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఆదివారం అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సోమవారం అమ్మవారు ధన లక్ష్మీ అలంకారంలో, మే 2వ తేదీన సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిస్తారని చెప్పారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు మోటమర్రి బాబాప్రసాద్, సామా లక్ష్మీకాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరు

రామానగరం (చల్లపల్లి): విద్యుదాఘాతంతో ఇటీవల మృతిచెందిన యువకుని కుటుంబానికి విద్యుత్ శాఖ రూ.5 లక్షలు మంజూరు చేసింది. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరం బీసీ కాలనీలో గతేడాది డిసెంబర్ 10వ తేదీన తుపాను సమయంలో యువకుడు కోమటి హరీష్ వర్షంలో ద్విచక్ర వాహనంపై పశువుల చావిడి వద్దకు వెళుతుండగా విద్యుత్ వైర్ తెగి హరీష్‌పై పడింది. విద్యుదాఘాతంతో హరీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఏపీసీపీడీసీఎల్ ద్వారా మంజూరైన రూ.5 లక్షలకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా మృతుని తల్లి కోమటి వెంకటేశ్వరమ్మకు శనివారం అందజేశారు. విద్యుత్ శాఖ ఏఈ అరవింద్, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్, నాయకులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



మచిలీపట్నంటౌన్: ఈ వేసవి సెలవుల్లో పిల్లలకు మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన వినాయక ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్ ఆట విడుపుగా ఉంటుందని మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా అన్నారు. విజయవాడ బైపాస్‌రోడ్డులోని జల్దు వారి తోటలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సలార్ దాదా శనివారం రాత్రి ప్రారంభించి మాట్లాడారు. నగరంలోని చిన్నారులు ఈ వేసవిలో ఆహ్లాదంగా, ఉత్సాహంగా గడిపేందుకు ఎగ్జిబిషన్ దోహదపడుతుందన్నారు. ఎగ్జిబిషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మలేషియా ట్విన్ టవర్స్, లండన్ బ్రిడ్జి, సెల్ఫీషో వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఎగ్జిబిషన్ మేనేజర్ రాజేంద్ర మాట్లాడుతూ మచిలీపట్నం ప్రాంత ప్రజలు మలేషియా టవర్స్, లండన్ బ్రిడ్జిలను తిలకించిన అనుభూతిని కలిగించేలా ఎగ్జిబిషన్‌లో వీటిని ఏర్పాటు చేశామని చెప్పారు. డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత థామస్ నోబుల్, కార్పొరేటర్ జోగి చిరంజీవి, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్‌నోబుల్, మొహమ్మద్ రఫీ, షేక్ మొహమ్మద్ సాహెబ్, మరీదు నాగరాజు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన



పెడన: నడుపూరు గ్రామ పంచాయతీ పరిధి నెరికేపాలెం గ్రామానికి వెళ్లే జెడ్పీ రహదారిలోని వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. వంతెన కింది భాగం కూలిపోతుండటంతో వంతెనపై ఉన్న రోడ్డు కుంగింది. స్థానికులు గమనించి గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేశారు. ఈఓపీఆర్డీ ఎం. జయరాము, పంచాయతీ కార్యదర్శి ఆవుల రాఘవ తదితరులు వంతెనను పరిశీలించారు. వంతెనపై ప్రయాణించవద్దంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పెడన బ్రాంచ్ కెనాల్‌పై ఈ వంతెన నిర్మించారని, నడుపూరు–నెరికేపాలెం గ్రామాల మధ్య ఈ వంతెన ఉందని, అటుగా ప్రయాణించే వారు వంతెన పక్క నుంచి రాకపోకలు సాగించాలని పంచాయతీ అధికారులు సూచించారు.

అభినవ మేల్కోటలో ఉత్సవ శోభ

- నేటి నుంచి స్వామివార్ల పుష్కర బ్రహ్మోత్సవాలు
- 6 నుంచి మహా కుంభాభిషేక ఉత్సవాలు
- 12న లక్ష మందికి మహా అన్నసమారాధన



ముస్తాబైన శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయం

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గ్రామం పుష్కర బ్రహ్మోత్సవాలు, మహా కుంభాభిషేక ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. గ్రామంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం నుంచి స్వామివార్ల పుష్కర బ్రహ్మోత్సావాలను, మే నెల 6 నుంచి కుంభాభిషేక ఉత్సవాలను నిర్వహించనున్నారు. చివరి రోజైన మే 12న లక్ష మంది భక్తులకు ఆలయ ప్రాంగణంలో మహా అన్న సమారాధనను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అతిపెద్ద ఏకశిలా శ్రీమన్నారాయణుడి విగ్రహం..

గ్రామంలో సుమారు 200 ఏళ్ల క్రితం పంచాంగం వంశీయులు గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయాన్ని నిర్మించారు ఈ ఆలయానికి పంచాంగం వంశీయులు 35 ఎకరాల మాగాణి భూమిని విరాళంగా సమర్పించారు. ఆలయాన్ని దేవదాయ శాఖాధికారులు తమ ఆధీనంలోకి తీసుకొని స్వామివార్లకు ధూపదీప నైవేద్యాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్తలుగా మాత్రం పంచాంగం వంశీయులే వ్యవహరించారు. కాలక్రమేణా ఈ ఆలయం జీర్ణావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో 1998వ సంవత్సరంలో అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంతప్ కుమార రామాను జీయర్ స్వామీజీ దేవదాయ శాఖ అధీనంలో ఉన్న ఆలయాన్ని దత్తత తీసుకుని జీర్ణోద్ధరణకు పూనుకున్నారు. పాత ఆలయం స్థానంలోనే సుమారు రూ. రెండు కోట్ల వ్యయంతో కర్ణాటకలోని మేల్కోట తరహాలో నూతన ఆలయాన్ని నిర్మించారు. 2012లో నూతన విగ్రహ, శిఖర ప్రతిష్ట జరిగాయి. గర్భాలయంలో 11 అడుగుల ఏకశిలా శ్రీమన్నారాయణుడి విగ్రహాన్ని, ఉపాలయాల్లో రాజ్యలక్ష్మీ, గోదా అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. శ్రీమన్నారాయణుడి ఆలయానికి ఇరువైపులా రామానుజాచార్యులు, నమ్మాళ్వార్ల ఆలయాలను నిర్మించారు. ఇటీవల సుమారు రూ.కోటి వ్యయంతో అష్ట భుజ మండపాన్ని నిర్మించారు.

ఆధ్యాత్మిక శోభ...

పుష్కర బ్రహ్మోత్సవాలు, కుంభాభిషేక ఉత్సవాల నేపథ్యంలో ఉల్లిపాలెం గ్రామం ఆధ్మాతిక శోభతో ఉట్టిపడుతోంది. ఉత్సవాలను నిర్వహించేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది రుత్విక్కులు తరలిరానున్నారు. ఆలయం నుంచి మూడు కిలోమీటర్ల మేర భారీ లౌడ్ స్పీకర్లను ఏర్పాటు చేశారు. గ్రామ మంతా దేవతామూర్తుల ఫ్లెక్సీలు, చిత్రపటాలను నెలకొల్పారు. ఆలయ ప్రాంగణమంతా తాటాకు పందిళ్లతో తీర్చిదిద్ది, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఇప్పటికే పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్సవాలను తిలకించేందుకు ఉల్లిపాలెంకు తరలివచ్చారు.

ఒకే సమయంలో స్వామివారు, శిఖరాల దర్శనం

ఆలయంలోని ముఖ ద్వారం దగ్గర నిలబడితే ఆలయంపైన ప్రతిష్ఠించిన మూడు విమాన శిఖరాలు, గర్భాలయంలోని శ్రీమన్నారాయణుడి 11 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని ఒకే సమయంలో దర్శించుకొనే అవకాశం ఈ ఆలయంలో మాత్రమే ఉంది. ప్రస్తుతం కుంభాభిషేక ఉత్సవాల నేపథ్యంలో ఈ విశిష్టతను భక్తులకు వివరించేలా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పోర్టు పనుల ప్రారంభాన్ని పండుగలా నిర్వహిద్దాం

మేయర్ వెంకటేశ్వరమ్మ



మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం బందరు పోర్టు పనులు ప్రారంభ ఘట్టాన్ని నగరంలో పండుగలా నిర్వహించేందుకు అందరూ సన్నద్ధం కావాలని నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అన్నారు. మే 22వ తేదీన బందరు పోర్టు పనులు ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం విచ్చేస్తున్న సందర్భంగా మేయర్ వెంకటేశ్వరమ్మ శనివారం తన చాంబర్‌లో కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. మేయర్ మాట్లాడుతూ బందరు పోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎంతోకాలంగా ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గుర్తించి బందరు పోర్టు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని చెప్పారు. పోర్టు పనులను ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు రావాలని నగరంలోని ప్రతి ఇంటికి వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఆహ్వానం పలకాలన్నారు. 22వ తేదీన నగరంలో పండుగ వాతావరణం కనిపించేలా ప్రధాన రహదారులతో పాటు అన్ని ప్రాంతాల్లో మామిడాకుల తోరణాలు, పార్టీ తోరణాలు, స్వాగత ముఖద్వారాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. సీఎం జగన్ సభకు ప్రజలు స్వచ్ఛందంగా వేలాదిగా తరలివస్తారు కాబట్టి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించాలన్నారు. పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించటంతో పాటు గోసంఘం వద్ద నిర్మించిన జీ+3 గృహాలను ప్రారంభిస్తారన్నారు. డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత థామస్ నోబుల్, లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్ దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అలాగే నగరంలోని పలు డివిజన్లలో వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ, గూడవల్లి నాగరాజు వారి పరిధిలోని సచివాలయాల వద్ద పోర్టు పనుల ప్రారంభ కార్యక్రమానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో చర్చించారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో క్రికెట్ పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. శనివారం ఉదయం జరిగిన పోటీల్లో గుడివాడ జట్టుపై మోపిదేవి జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుడివాడ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మోపిదేవి జట్టు 11 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి విజయం సాధించింది. మోపిదేవి జట్టులో నరేంద్ర అత్యధికంగా 46 పరుగులు చేయడంతో పాటు రెండు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. సాయంత్రం జరిగిన పోటీల్లో బాపట్ల జట్టుపై పులిగడ్డ జట్టు విజయం సాధించింది. పులిగడ్డ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 116 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బాపట్ల జట్టు 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 77 పరుగులు మాత్రమే చేయగలిగింది. పులిగడ్డ జట్టులోని అంజి అత్యధికంగా 63 పరుగులు చేయడంతో నిర్వాహకులు రంగిశెట్టి శ్రీనివాసరావు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందజేశారు.

గోకర్ణేశ్వరుడి కల్యాణోత్సవాలు ప్రారంభం

కోడూరు: లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాల నడుమ ఉదయం గోకర్ణేశ్వరుడిని పెండికుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ధ్వజారోహణ జరిగింది. కల్యాణోత్సవాలను పురస్కరించుకొని గోకర్ణేశ్వరుడి లింగాకారుడికి పంచామృతాభిషేకాలు జరిగాయి. ఆదివారం ప్రత్యేక హోమాలు, రాజ్యలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, మే 1న రాత్రికి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ సుధాకరరావు తెలిపారు. 2న మహా అన్నసమారాధన, రాత్రికి రథోత్సవం, 3న అవభృదస్నానం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. కల్యాణం రోజు ఆలయం వద్ద పంచరత్నాల నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేశామని ఈఓ తెలిపారు.

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి: రానున్న ఎన్నికల్లో స్పష్టమైన వైఖరితో ప్రజల్లోకి వెళ్లి వైఎస్సార్ సీపీ గెలుపు సాధించడం ఖాయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. శనివారం సాయంత్రం చల్లపల్లి గ్రామ సచివాలయం–3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్ బాబు గ్రామంలోని 728 గృహాలను సందర్శించి సంక్షేమ పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పేద మహిళకు హామీ..

స్థానిక కేడీసీసీ బ్యాంక్ పక్కన అద్దె ఇంట్లో జీవిస్తున్న నిరుపేద ముస్లిం మహిళ షేక్ మహబూబున్నీసా తన భర్త మస్తాన్‌కు తొంటి బాల్ మార్పిడి ఆపరేషన్ సమస్యను ఎమ్మెల్యే రమేష్ బాబు దృష్టికి తీసుకువచ్చింది. ఎమ్మెల్యే వివరాలు నమోదు చేసుకున్నారు. తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నేటికీ ప్రతిపక్ష పార్టీలు ఎవరు ఎవరితో కలవాలో తెలియక గందరగోళంలో ఉన్నాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో స్పష్టమైన విధానంతో, ప్రజల మద్దతుతో ఎన్నికల్లో మరోసారి గెలుపు సాధించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఘంటసాల జెడ్పీటీసీ తుమ్మల మురళి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, సర్పంచ్ వల్లూరు ఉమా, పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు నాగ సీతారామారావు (ఫణి), అరజా శివశంకర్, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి కొండలు, మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



పెడన: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడు వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. పెడనలో ఇటీవల జరిగిన వేసవి క్రీడాపోటీల విజేతలకు శనివారం స్థానిక బంగ్లా స్కూల్‌లో బహుమతులు ప్రదానం చేశారు. రాజీవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకు మాత్రమే పరిమితం కావద్దని, ఆటలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బైలపాటి జ్యోతి, కౌన్సిలర్ భళ్ల గంగయ్య, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు ముత్యాల మురళి, కోడూరు శ్రీను, వాసు, బళ్ల సాంబశివరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆపరేషన్‌కు రూ.4 లక్షల మంజూరు

పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సింహాద్రి



సీఎం సహాయనిధి మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: పెదప్రోలు శివారు కప్తానుపాలెంకు చెందిన మట్టా కమలాకరరావుకు కిడ్నీ ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4 లక్షల ఆర్థిక సహాయ పత్రాలను బాధితుడికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అందజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారుడు మాట్లాడుతూ వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించే తనకు కిడ్నీ సమస్య తలెత్తగా పరామర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆపరేషన్ కోసం రూ.4 లక్షలు మంజూరు చేయించడం జీవితంలో మర్చిపోలేనని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, సచివాలయ నియోజకవర్గ కన్వీనర్ మద్ది చిన్నారి పాల్గొన్నారు.

వృద్ధులకు మంచాలు, ఫ్యాన్లు పంపిణీ

మచిలీపట్నంటౌన్: హైదరాబాద్‌లోని కేంద్రియ విశ్వవిద్యాలయం ఆచార్యులు మత్తి నిర్మలానంద ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త బీజేఎస్ కుమార్ శనివారం స్థానిక ఈడేపల్లిలోని జట్టి నరసింహం ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులు, వికలాంగులకు మంచాలు, ఫ్యాన్లు, కూజాలు, గ్లూకోజ్ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. పాస్టర్ ఇశ్రాయేల్, ఆశ్రమ సూపర్‌వైజర్ లక్ష్మీ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

బందలాయిచెరువు(అవనిగడ్డ): బస్సు ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. బందలాయిచెరువు గ్రామానికి చెందిన గ్రామం నుంచి అవనిగడ్డ వైపునకు బైక్‌పై బయలుదేరాడు. బందలాయి చెరువు మలుపు వద్దకు వెళ్లగానే ఎదురుగా వచ్చిన ఆర్టీసీ హైయర్ బస్ ఢీట్టింది. తీవ్రంగా గాయపడిన అఖిల్‌ను స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లగా మెరుగైన వైద్యం కోసం రేపల్లెకు, అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. కుడిచేయి, ఎడమకాలు విరగడంతో పాటు కాలు లోతుకల్లా చర్మం కొట్టుకుపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

కోనేరుసెంటర్: మంగినపూడి బీచ్‌లో ఓ యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంటుమిల్లి మండలం మణిమేశ్వరానికి చెందిన కటారి విశ్వేశ్వర కుమార్ వివిధ సమస్యలతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం మంగినపూడి బీచ్‌లో ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన మెరైన్ పోలీసులు ఆయనను కాపాడి ఒడ్డుకు చేర్చారు. మెరైన్ హెడ్ కానిస్టేబుల్ జి. భరతరాజు, హోంగార్డు పి. స్వామి, తాలూకా అవుట్ పోస్ట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సిబ్బంది వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, అబ్దుల్ రహీంలను మెరైన్ సీఐ ఎం. శ్యామ్‌కుమార్, ఎస్ఐ చంద్రబోస్, తాలూకా ఎస్ఐ చాణక్య అభినందించారు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

మచిలీపట్నంటౌన్: జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నగరంలోని ప్రభుత్వ రాంజీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాన్ని బందరు డీవైఈఓ యూపీ సుబ్బారావు పరిశీలించారు. ఈ కేంద్రంలో 160 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 150 మంది పరీక్షకు హాజరయ్యారు. 10 మంది గైర్హాజరయ్యారు.

అవినీతి లేకుండా పథకాల అమలు

- 'జగనన్నే మా భవిష్యత్తు' చరిత్ర సృష్టించింది
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చరిత్ర సృష్టించిందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కుటుంబాలను కలిసి చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం దేశంలో రికార్డు నెలకొల్పిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 1.10 కోట్ల మంది నుంచి మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో 93 వేల కుటుంబాలు ఉండగా 83 వేల కుటుంబాలను కలిశామని చెప్పారు. 78 వేల కుటుంబాల నుంచి మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. మిగిలిన కుటుంబాలను కలిసి ప్రజా సర్వే చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి, అక్రమాలు జరగలేదని చెప్పారు. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, సచివాలయాల నియోజకవర్గ కన్వీనర్ మద్ది చిన్నారి, అవనిగడ్డ, మోపిదేవి సచివాలయ కన్వీనర్లు షేక్ నజీర్‌బాషా, కోసూరు నాగమల్లేశ్వరరావు, పెదప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు పాల్గొన్నారు.

పండుగలా సాగిన 'జగనన్నే మా భవిష్యత్తు'



మాట్లాడుతున్న షేక్ సలార్‌దాదా, చిత్రంలో కన్వీనర్లు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పెద్ద పండుగలా సాగిందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 7న వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా అప్పటి నుంచి శనివారం వరకు ఉత్సాహంగా సాగిందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి నగర ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందని చెప్పారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్, కార్పొరేటర్ మీర్ అస్గర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా పూర్తి..

కృత్తివెన్ను: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కృత్తివెన్ను మండలంలో విజయవంతంగా పూర్తయిందని జెడ్పీటీసీ రత్నకుమారి తెలిపారు. పార్టీ శ్రేణులతో కలిసి శనివారం ఆమె కృత్తివెన్నులో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు సమిష్టిగా నిర్వహించారని, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, మండల ఇన్‌చార్జి టి. శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ కె. బాపూజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు లక్ష్మాజీ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు స్పందన..

మచిలీపట్నంటౌన్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 35, 46 డివిజన్లలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల అనుమతితో వారి గృహాలకు, సెల్‌ఫోన్లపై కూడా స్టిక్కర్లు అంటించారు. 35వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ ఇక్బాల్, డివిజన్ కన్వీనర్లు, గృహ సారథులు, 46వ డివిజన్‌లో కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కన్వీనర్లు సత్తెనపల్లి శ్రీనివాసరావు, జగన్, ధనికొండ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా కన్వీనర్ వీఏఎన్ మూర్తి, గృహ సారథులు పాల్గొన్నారు.

- పెడన: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు నమ్మకం ఉంచారని, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఈ విషయం స్పష్టమైందని పెడన మండల, పట్టణ కన్వీనర్లు కొండవీటి నాగబాబు, బండారు మల్లికార్జునరావు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. పట్టణ, మండల సమన్వయకర్తలు మతీన్‌ఖాన్, బెజవాడ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.
- గూడూరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రజలు విశేషంగా ఆదరించారని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. శనివారం గూడూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతంపై విలేకరులతో మాట్లాడారు. జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, నాయకులు గొరిపర్తి రవికుమార్, తలుపుల వెంకట కృష్ణారావు, నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధర్‌రావు, బొర్రా సాంబయ్య పాల్గొన్నారు

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

కౌన్సిల్ సమావేశంలో ఛైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి

పెడన: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి అన్నారు. శనివారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. మాజీ కౌన్సిలర్ బొలెం వెంకటేశ్వరరావు మృతికి సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అజెండాలోని పలు అంశాలు చర్చకు వచ్చాయి. పాత కూరగాయల మార్కెట్ వద్ద షాపు గుత్తకాలం గడువు ముగియడంతో మరో మూడేళ్లకు అద్దెను పెంచి ఇచ్చేలా ఆమోదం తెలిపారు. షాపులు లీజుకు తీసుకున్న వారు సబ్ లీజులకు ఇచ్చి వాహనాలు పార్కింగ్‌కు అవకాశం లేకుండా చేస్తున్నారని 17వ వార్డు కౌన్సిలర్ మెట్ల గోపీప్రసాద్ అన్నారు. దీనిపై నిత్యం ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. సబ్ లీజులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు మాట్లాడుతూ శానిటేషన్ అధ్వానంగా ఉందని, సచివాలయ శానిటరీ కార్యదర్శి అసలు కనిపించడం లేదని చెప్పారు. కమిషనర్ అంజయ్య స్పందిస్తూ ఈ విషయాన్ని ఆర్డీ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కౌన్సిల్ అజెండాలో ఈ అంశాన్ని పొందుపరిచి కౌన్సిల్ ఆమోదించి ఆర్డీకి పంపించాలని ఛైర్‌పర్సన్‌కు తెలిపారు. తప్పకుండా ఈ సారి కౌన్సిల్ అజెండాలో పొందుపరచాలని కమిషనర్‌కు సూచించారు. వేసవిలో మురుగు కాలువల్లో షిల్ట్‌తీత పనులు చేపట్టాలని, వర్షాకాలంలో చేపట్టకుండా చూడాలని గరికిముక్కు చంద్రబాబు సూచించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ బైలపాటి జ్యోతి, సీనియర్ కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు, బళ్ల గంగయ్య, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.